క్లుప్తంగా

ఆర్థికసాయం



గార్ల : అనారోగ్యంతో మృతిచెందిన హమాలీ కార్మికుడు దొండ నంద కుటుంబానికి తోటి హమాలీలు గురువారం రూ.14,000 నగదు, 50 కేజీల బియ్యం అందజేసి తమ ఔదార్యం చాటుకున్నారు. శ్రీనివాసరావు, సత్యవతి, హమాలీలు తదితరులు పాల్గొన్నారు.

కాకతీయుల నిర్మాణం అద్భుతం



మహబూబాబాద్ రూరల్ : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ఆరో తరగతి విద్యార్థులు గురువారం క్షేత్ర పర్యటనలో భాగంగా శ్రీవేణుగోపాలస్వామి వారి దేవాలయాన్ని సందర్శించారు. కాకతీయుల కాలంలో దేవాలయ నిర్మాణం జ రిగిందని, ఆనాటి శిల్పుల కళా నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానం, ఏకాగ్రతను గురించి ఉపాధ్యాయులు వివరించారు. కార్యక్రమంలో భాషా ఉపాధ్యాయులు డాక్టర్ ఎం. రమేష్, డి. విజయలక్ష్మి, ఎం.వీణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒకే ఇంట్లో ఇద్దరికి ప్రభుత్వ కొలువులు



దంతాలపల్లి : మండలంలోని రామానుజపురం గ్రామానికి చెందిన సోదరులు ఒకేసారి ప్రభుత్వ కొలువు సాధించి ఒకేసారి ముఖ్యమంత్రి చేతుల మీదుగా నియామక పత్రాలు తీసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేవు. గ్రామానికి చెందిన మల్లం గణేష్, మహేష్ ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్–4 పోటీ పరీక్షల్లో ఒకే సారి ప్రభుత్వ కొలువులు సాధించారు.

బస్సుల సంఖ్య పెంచాలి



తొర్రూరు : ఉచిత బస్సు సౌకర్యంతో రద్దీ పెరిగిందని, బస్సుల సంఖ్య పెంచాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. ఈ మేరకు గురువారం బస్టాండ్ సెంటర్‌లో మాస్‌లైన్ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ నెల 9న బస్‌భవన్ ముట్టడిస్తామన్నారు. ముంజంపల్లి వీరన్న, బండపల్లి వెంకటేశ్వర్లు, జక్కుల యాకయ్య, చింతా నవీన్, మురళీ, మల్లేశంపాల్గొన్నారు.

శబరిమలలో అయ్యప్ప భక్తుడి మృతి

డోర్నకల్ : మండలంలోని వెన్నారం గ్రామానికి చెందిన అయ్యప్ప మాల ధరించిన భక్తుడు శబరిమలలో గుండెపోటుతో మృతి చెందాడు. వెన్నారానికి చెందిన కుదుళ్ల వీరన్న(51) భక్తులతో కలిసి శబరిమలకు వెళ్లారు. గురువారం తెల్లవారుజామున అయ్యప్పస్వామి దర్శనం కోసం సన్నిధానానికి వెళ్తూ మెట్లు ఎక్కుతుండగాగుండెపోటుతో కుప్పకూలాడు. పక్కనే ఉన్న అయ్యప్ప భక్తులు పరీక్షించగా అప్పటికే వీరన్న మృతి చెందాడు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ..

● డ్రైవర్ మృతి, క్లీనర్‌కు తీవ్రగాయాలు



ఇర్ఫాన్ మృతదేహం

దంతాలపల్లి : ఆగి ఉన్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ మృతి చెందగా క్లీనర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం తెల్లవారుజామున మండలంలోని బీరిశెట్టిగూడంలో చోటుచేసుకుంది. కరీంనగర్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని నర్సరావుపేటకు బియ్యం లోడ్‌తో వెళ్తున్న లారీని డ్రైవర్ మండలంలోని బీరిశెట్టిగూడెం వద్ద నిలిపాడు. హరియాణకు చెందిన లారీ ఏపీలోని విజయవాడకు బియ్యం లోడ్‌తో వెళ్తూ ఆగి ఉన్న మరో లారీని వెనుక నుంచి ఢీకొంది. ఈ ఘటనలో ఢీకొట్టిన లారీ డ్రైవర్ ఇర్ఫాన్ (23), క్లీనర్ సాకీర్‌కు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్సై రాజు ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను 108లో జిల్లాలోని ఏరియా ఆస్పత్రికి తరలి స్తుండగా ఇర్ఫాన్ మృతిచెందాడు. మృతుడి సోదరుడు జఫ్రూ ఫిర్యాదు మేరకు కేసు న మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

నర్సింహులపేట : మండలంలోని కౌసల్యదేవిపల్లి, రామన్నగూడెం శివారులోని ఆకేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను గురువారం తెల్లవారుజామున సీజ్ చేసినట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు.

చదవాలంటే..నడవాలి

పాఠశాల లేని ఔసలితండా

● బస్సు సౌకర్యం లేక చదువులకు స్వస్తి



కాలినడకన పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు



చదువు మానేసిన విద్యార్థినులు

పెద్దవంగర : అక్షరజ్ఞానం నేర్వాలంటే గిరిజన బిడ్డలు కాలినడకన నాలుగు కిలోమీటర్లు నడవాల్సిందే.అయినా వ్యయ, ప్రయాసలకోర్చి పొరుగు ప్రాంతాలకు వెళ్లి చదువుకుంటున్నారు. తండాకు బస్సు సౌకర్యం లేక ఇంటర్, డిగ్రీ చదువులకు మధ్య స్వస్తి చెబుతున్నారు. అత్యవసర సమయంలో ప్రైవేటు వాహనాలే దిక్కు. అలాంటి సమయంలో పలువురి విద్యార్థులు మధ్యలోనే చదువు ఆపేశారు. సౌకర్యంగా రోడ్డు ఉన్న తండాకు బస్సు రాని పరిస్థితి.

బస్సు సౌకర్యం లేక చదువులకు స్వస్తి..

ఔసలితండాలోని విద్యార్థులు చదువుకునేందుకు బొమ్మకల్లు గ్రామంలోని ఉన్నటువంటి జెడ్పీ, ప్రాథమిక పాఠశాల్లో చదువుకునేందుకు సుమారు. 4 కీ.మీటర్ల దూరాన కాలినడక వెళ్లి చదువుకుంటున్నారు. ప్రాథమిక విద్యను 3 విద్యార్థులు, జెడ్పీ ఉన్నత పాఠశాల్లో 5 విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. మార్గం మధ్యలో చెరువు, కోతుల బెడదతో బిక్కు బిక్కుమంటూ చదువుకోవాల్సిన పరిస్థితి. ఇంటర్, డిగ్రీ విద్యార్థులు 6గురు విద్యార్థులు చదువులకు స్వస్తి చెప్పారు. ఇద్దరు యువకులు ఆటోల్లో వెళ్లి చదువుకుంటున్నారు. గ్రామీణా ప్రాంత ప్రజలకు సౌకర్యార్థం ఆర్టీసీ ప్రవేశ పెట్టిన పల్లె వెలుగు బస్సులు రావటం లేదు. అంతే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యానికి నోటుకోవడం లేదు. ఉచిత బస్సు సౌకర్యం ప్రవేశ పెట్టినప్పటి నుంచి పూర్తిగా బస్సులు రావడం లేదని తండా వాసులు పేర్కొంటున్నారు.

నూతన జీపీగా కాంధ్య తండా..

బొమ్మకల్లు జీపీ పరిధిలో కాంధ్య తండా, ఔసలితండాలు ఉండేవి. కాగా ఇటీవల కాంధ్యతండాను నూతన జీపీగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ తండాలో గతంలో ప్రాథమిక పాఠశాల ఉండేది. విద్యార్థులు లేరనే సాకుతో దాన్ని మూసేశారు. నేడు ఆ తండా నుంచి ప్రాథమిక విద్య కోసం ఏడుగురు, ఉన్నత విద్య అభ్యసించేందుకు 11 మంది విద్యార్థులు బొమ్మకలు పాఠశాలకు వెళ్తున్నారు. వీరు రోజు 2 కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లి చదువుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కోతులు, కుక్కలతో పాటు చెరువుకు రక్షణ కవచం లేకపోవడంతో ప్రమాద ఘంటికలు హెచ్చరిస్తున్నాయి. అధికారులు చొరవ తీసుకొని నూతనంగా ఏర్పడిన కాంధ్య తండాలో మూతబడిన పాఠశాలను పునఃప్రారంభిస్తే ఔసలితండా, కాంధ్య తండాల విద్యార్థులకు నడకయాతన తప్పనుందని తండా వాసులు చెబుతున్నారు.

సౌకర్యాలు కల్పిస్తే చదువుకుంటాం



బస్సు సౌకర్యం కల్పిస్తే మేము రోజు కాలేజీకి వెళ్లి చదువుకుంటాం. మా తండాకు బస్సు వస్తే చదువు ఆటంకం లేకుండా ఉంటుంది. కేవలం బస్సు సౌకర్యం లేక పోవడంతో చదువును మధ్యలోనే ఆపేస్తున్నాం. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించాలని కోరుతున్నాం.

– తునుగూరు శ్వేత, విద్యార్థిని, ఔసలితండా

అన్ని రకాల మందులు అందజేయాలి

● పీవైఎల్ జిల్లా కార్యదర్శి రంగయ్య



వివరాలు అడిగి తెలుసుకుంటున్న నాయకులు

నెహ్రూసెంటర్ : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వస్తున్న రోగులకు అన్ని రకాల మందులు, పరీక్షలు నిర్వహించాలని ప్రగతిశీల యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కందాల రంగయ్య అన్నారు. పీవైఎల్, పీడబ్ల్యూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని గురువారం రోగులకు అందుతున్న సేవలపై సర్వే నిర్వహించారు. ఆస్పత్రిలో కనీస సౌకర్యాలు, సరైన వైద్యం అందకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని, సూపరింటెండెంట్ సెలవులపై వెళ్లడంతో పూర్తిస్థాయిలో ఆస్పత్రికి సంబంధించిన నిర్ణయాలు జరగడం లేదన్నారు. సమస్యలపై కలెక్టర్, అధికారులు స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లింగస్వామి, శివసాయి, రాజు, పైండ్ల యాకయ్య, ఈర్ల వెంకన్న, పల్లెల పాపారావు పాల్గొన్నారు.

'అభివృద్ధిని విస్మరిస్తున్న ఎమ్మెల్యే'

తొర్రూరు : పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధిని స్థానిక ఎమ్మెల్యే విస్మరించారని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పూసల శ్రీమాన్ అన్నారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోపై బీజేపీ ఆధ్వర్యంలో గురువారం డివిజన్ కేంద్రంలో చార్జ్‌షీట్ విడుదల చేశారు. శ్రీమాన్ మాట్లాడుతూ..అమలు కానీ హామీలపై ఎమ్మెల్యేను ప్రజా క్షేత్రంలో నిలదీయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ అర్బన్ అధ్యక్షుడు పల్లె కుమార్, నాయకులు గట్టు రాంబాబు, పైండ్ల రాజేష్, యాకయ్య, గడల శేఖర్, నవీన్, కొండ యాకన్నలు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

మరిపెడ : సీఎం కప్ పోటీలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ అనితాదేవి కోరారు. మరిపెడలో పీఈటీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించనున్న సీఎం కప్ క్రీడోత్సవాలను మరిపెడ మున్సిపల్ పరిధిలో 7, 8తేదీల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ క్రీడలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే విధంగా మండల పరిధిలో 10,11,12వ తేదీల్లో పోటీలు నిర్వహిస్తారన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా స్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. రాజకుమారి, రమాదేవి, శ్రీకాంత్, రవీందర్, శ్రీహరి, స్వప్న, శ్రీలత, జ్యోతి, రాంబాబు, శ్రీనివాస్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ భూమిని పేదలకు ఇవ్వాలి'



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

నెల్లికుదురు : ప్రభుత్వం కొనుగోలు చేసిన భూమిని సర్వే చేసి పేదలకు పంపిణీ చేయాలని సీపీఐ మండల కమిటీ సభ్యుడు బాణాల యాకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని నైనాల గ్రామంలో గురువారం సీపీఐ గ్రామ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 1998–99లో అప్పటి ప్రభుత్వం ఇంటి స్థలాల కోసం గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 610, 611లో 3.13ఎకరాల భూమిని కొనుగోలు చేసి లబ్ధిదారులకు పంపిణీ చేసి పట్టాలు ఇచ్చినట్లు తెలిపారు. అదే భూమిని కేసీఆర్ ప్రభుత్వంలో నర్సరీ, ప్రకృతివనం, పల్లె దవాఖాన కోసం కేటాయించగా 35 గుంటలు మిగిలిందన్నారు. అది ఇప్పుడు అన్యాక్రాంతం అయ్యిందని సర్వే చేసి నిరుపేదలకు గృహలక్ష్మి పథకంలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

ఓపెన్ అడ్మిషన్లు ప్రారంభం

కురవి : ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు సిద్దార్థ హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎ.కార్తీక్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత గల యువతీ, యువకులు ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో చేరేందుకు 98852 14380 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

చర్యలు తీసుకోవాలి

బయ్యారం: సమయపాలన పాటించని నారాయణపురం పంచాయతీ కార్యదర్శి రమేశ్‌పై చర్యలు తీసుకోవాలని స్థానికులు అధికారులను కోరారు. ఈ మేరకు పంచాయతీకి చెందిన పలువురు గురువారం విలేకరులతో మాట్లాడారు. గ్రామస్తులు గణేష్, చిన్నబాలయ్య, మల్లయ్య, సంపత్, విజయ్, రాము తదితరులు ఉన్నారు.

రైతులను ఆదుకోవాలి: చిన్నచంద్రన్న

నెహ్రూసెంటర్ : అకాల వర్షాలతో పంటలు కోల్పోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి చిన్నచంద్రన్న డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సన్నధాన్యంతో పాటు దొడ్డురకం ధాన్యానికి కూడా రూ.500 బోనస్ చెల్లించాలన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజాపాలన విజయోత్సవాలు జరుపుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి పైండ్ల యాకయ్య, పాపారావు, ఊడుగుల రాములు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

డీఈఓకు వినతి

మహబూబాబాద్ అర్బన్ : రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యాసంస్థలో ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ ఢిల్లీ ఐటీసీ సహకారంతో వైద్యపరీక్షలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రవీందర్‌కు ఐజీడీ జిల్లా కోఆర్డినేటర్ ప్రభాకర్ వినతిపత్రం అందజేశారు. ఔట్‌రిచ్ వర్కర్లు కవిత, సరస్వతీ, సునీత, క్రాంతి, మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాం, వాకీటాకీల పంపిణీ

కేసముద్రం : కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో సెక్యూరిటీ గార్డులకు మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి గురువారం యూనిఫాంలు, వాకీటాకీలను అందజేశారు. డీఎంఓ వెంకటేశ్వర్లు, స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ అమరలింగేశ్వర్‌రావు, గ్రేడ్–3 సెక్రటరీ రాజేంద్రప్రసాద్, డైరెక్టర్లు వసంతరావు, ఎండీ అయూబ్‌ఖాన్, రాము, యాదగిరి పాల్గొన్నారు.

చెక్కు అందజేత

గార్ల : మర్రిగూడెం గ్రామానికి చెందిన ధరావత్ ముత్తి ఇటీవల అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందగా, ఆమెకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కోటా ద్వారా మంజూరైన రూ.45,000 సీఎంఆర్ఎఫ్ చెక్కును సీపీఎం మండల కార్యదర్శి సత్యవతి గురువారం అందజేశారు.

అనాథ బాలికలకు బియ్యం..

కురవి : మండలంలోని బలపాలకు చెందిన అనాథ బాలికలకు సీపీఎం ఆధ్వర్యంలో క్వింటా బియ్యంను గురువారం అందజేశారు. కార్యక్రమంలో మలేడి కోటయ్య, నాయకులు పిట్టల వెంకన్న, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్స్..

తొర్రూరు రూరల్ : మండలంలోని అమ్మాపురం జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలాలకు చెందిన విద్యార్థులకు టీచర్స్ లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్స్‌ను గురువారం అందజేశారు. లయన్స్ క్లబ్ ప్రతినిధి డాక్టర్ వేలూరి శారద జన్మదినాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు మెటీరియల్స్‌ను పంపిణీ చేశారు.


తనిఖీ

నెల్లికుదురు : మండలంలోని వివిధ గ్రామాల్లో చేపడుతున్న కుష్ఠు వ్యాధి గుర్తింపును పకడ్బందీగా చేపట్టాలని డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ వనాకర్‌రెడ్డి ఆశ కార్యకర్తలకు సూచించారు. మండలంలోని నైనాలలో జరుగుతున్న గుర్తింపు కార్యక్రమాన్ని గురువారం మండల వైద్యాధికారి శారదతో కలసి ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఎన్నిక

నర్సింహులపేట/ కేసముద్రం / మహబూబాబాద్ రూరల్ : యూత్ కాంగ్రెస్ నర్సింహులపేట మండల అధ్యక్షుడిగా పొన్నం శ్రీకాంత్, కేసముద్రం మండల అధ్యక్షుడిగా మహేందర్ ఎన్నికయ్యారు. అలాగే డోర్నకల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నర్సింహులపేటకు చెందిన రేఖ అనిల్ ఎన్నికయ్యారు. జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా మానుకోట మండలంలోని బోడగుట్ట తండా గ్రామానికి చెందిన అజ్మీరా సురేష్ నాయక్ ఎన్నికయ్యారు.

సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి



మహబూబాబాద్: ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని గిరిజన సామాజిక చైతన్య వేదిక అధ్యక్షుడు గుగులోత్ కిషన్ నాయక్ అన్నారు. తన తండ్రి, రిటైర్డ్ హెచ్ఎం హధీరాం జ్ఞాపకార్థం గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర సదనంలో పిల్లలకు దుప్పట్లు ఇతరత్రా సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాలుర సదనం సూపరింటెండెంట్ కృష్ణవేణి, బాదావత్ మోహన్, సునీత, ప్రియాంక, రాజ్‌కుమార్, శ్రీకాంత్, దిలీప్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు సేవ చేయాలి

దంతాలపల్లి : అనాథలు, వృద్ధులకు సేవ చేయాలని సామాజిక విద్యావేత్త సేను రాజేష్ అన్నారు. గురువారం అంతర్జాతీయ సేవకుల దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని పెద్దముప్పారం అమ్మ ఒడి అనాథాశ్రమంలో వృద్ధులకు, అనాథలకు పండ్లు, పాలు, బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

హామీలు అమలు చేయాలి

మహబూబాబాద్ / కురవి / కేసముద్రం : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి కె.వెంకన్న డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల్లో మహిళలకు ఉచిత బస్సు మినహా మిగితావి అసంపూర్తిగానే ఉన్నాయన్నారు. కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయకపోవడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాపాలన ప్రజావిజయోత్సవాల పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్నారు.కురవి మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో మండల కార్యవర్గ సమావేశం నిర్వహించగా సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.విజయసారథి, కేసముద్రంలో సీపీఎం మండల కార్యదర్శి గొడిశాల వెంకన్న మానుకోట కార్యక్రమంలో నాయకులు ఉపేందర్, రామయ్య, సత్తయ్య, రామయ్య, కరుణాకర్, సత్య ఉన్నారు.


డోర్నకల్‌లోనే పాఠశాల ఏర్పాటు చేయాలి

డోర్నకల్ : నియోజకవర్గానికి మంజూరైన ఇంటిగ్రేటెడ్ పాఠశాలను డోర్నకల్‌లోనే ఏర్పాటు చేయాలని మండల ఫొటో, వీడియోగ్రాఫర్స్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక గాంధీసెంటర్‌లో డోర్నకల్‌లో ఇంటిగ్రేటెడ్ పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరుతూ వారు ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్ చొరవ చూపాలని సీపీఎం మండల కార్యదర్శి శ్రీనివాసరావు గురువారం కోరారు.

రుచికరమైన భోజనం వడ్డించాలి

గార్ల : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన మధ్యాహ్న భోజనం వడ్డించాలని ఎంఈఓ ఎం.వీరభద్రం సూచించారు. గురువారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో మధ్యాహ్న భోజనం వర్కర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎం.శివ, ఉపాధ్యాయుడు చార్యులు, సీఆర్పీలు పీఈటీలు పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక



గార్ల : పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడిగా బానోత్ రమేశ్ నాయక్‌ను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం ఎంపీడీఓ మంగమ్మ అధ్యక్షతన సమావేశం కొనసాగింది. గౌరవ అధ్యక్షుడిగా అజ్మీరా కిషన్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా వాంకుడోత్ అఖిలాష్, కోశాధికారిగా అజ్మీరా వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా కబ్బాకుల రామకృష్ణ, భూక్యా వెంకటేష్, మహిళా విభాగం ఉపాధ్యక్షురాలుగా జర్పుల సరస్వతి, 12 మందిని ఐసీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలి

● ఎమ్మెల్యే భూక్య మురళీ నాయక్



మహిళా కండక్టర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్, డీఎం శివప్రసాద్ తదితరులు

నెల్లికుదురు : కాంగ్రెస్ ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత బస్, గ్యాస్ సబ్సిడీ, రైతులకు బోనస్, రూ. 2లక్షల రుణమాఫీ తదితర సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీ నాయక్ సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం నిర్వహించిన ప్రజాపాలన ప్రజా విజయోత్సవ కార్యక్రమంలో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 100శాతం గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని వివరించారు. స్థానిక ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ సెంటర్‌లో పిల్లలకు యూనిఫాం అందించారు. ఇనుగుర్తి మండలంలోని చిన్ననాగారంలో గుండెపోటుతో మృతి చెందిన పోలోజు కలమ్మ అంతిమ యాత్రలో పాల్గొన్నారు.తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ పద్మ, ఏఈ షేక్ యాస్మిన్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్‌ల్లోనే పొదుపు చేసుకోవాలి: ఎమ్మెల్యే

మహబూబాబాద్ : సంపాదించిన డబ్బును బ్యాంక్‌ల్లోనే పొదుపు చేసుకుంటే డబ్బులకు భద్రత ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోఏర్పాటు చేసిన వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంక్‌ను గురువారం ఎమ్మెల్యే మురళీనాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు మాట్లాడుతూ.. బ్యాంకింగ్ రంగంలో కోఆపరేటివ్ బ్యాంక్ అగ్రగామిగా నిలుస్తుందన్నారు. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ బ్యాంక్ లావాదేవీలు, డిపాజిట్ కలిగే లాభాలపై ప్రజలకు ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో డీసీఓ వెంకటేశ్వర్లు, బ్యాంక్ డైరెక్టర్ సంపత్, వేణుగోపాల్, పాపిరెడ్డి, చంద్రమౌళి, హరినాద్, స్వప్నశ్రీనివాస్, బ్యాంక్ సీఈఓ సత్యనారాయణ రావుపాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధికి కృషి

మహబూబాబాద్ అర్బన్ : గూడూరు: కేసముద్రం: నెహ్రూసెంటర్ : మానుకోటలో ప్రభుత్వ విద్యారంగానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఫ్రెషర్స్ డే నిర్వహించగా ఎమ్మెల్యే మురళీనాయక్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. బలరాం నాయక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గూడూరు మండల కేంద్రంతో పాటు గోవిందాపురంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఎమ్మెల్యే మురళీనాయక్ గురువారం ప్రారంభించారు. అలాగే కేసముద్రం మండల కేంద్రంలో పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రీ ఐక్య క్రిస్మస్ వేడుకలకు ఎమ్మెల్యే మురళీనాయక్ హాజరై, మాట్లాడారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఆర్టీసీ డిపో ఆవరణలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే మురళీనాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా కండక్టర్ వి.ఉమను శాలువాతో సన్మానించారు.

నేటినుంచి సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

మహబూబాబాద్ అర్బన్ / బయ్యారం : సమగ్ర శిక్ష ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని నేటినుంచి మూడ్రోజుల పాటు నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నట్లు జిల్లా కేంద్రంలోని మండల విద్యాశాఖ అధికారి ఎస్.వెంకటేశ్వర్లుకు సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె నోటీస్ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు లింగాల సాగర్, జె.గణేష్ మాట్లాడుతూ..18 ఏళ్లనుంచి విద్యాశాఖ అనుసంధానంలో ఉద్యోగం చేస్తున్నామని, తమను రెగ్యులర్ చేసి పే స్కేల్ ఇవ్వాలన్నారు. నేడు జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ సమీపంలో నిర్వహించే సమ్మెకు సమగ్రశిక్ష ఉద్యోగులు తరలి రావాలని పిలుపునిచ్చారు. సమగ్రశిక్ష ఉద్యోగులు వీరయ్య, శ్రీలత, ఉప్పలయ్య, వీరన్న, అరుణ, కవిత, స్వప్న, లింగమూర్తి, రజిని, దర్గయ్య, వినోదతో పాటు తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన



కేసముద్రంవిలేజ్ జెడ్పీహైస్కూల్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

కేసముద్రం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్నమయ్య జిల్లాలో విద్యార్థుల దాడిలో సైన్స్ టీచర్ గుండెపోటుతో మృతిచెందడం బాధకరమని, ఇందుకు కేసముద్రంవిలేజ్ జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలను ధరించి గురువారం భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు చీకటి వెంకట్రాంనర్సయ్య, సంఘం బాధ్యులు, టీచర్లు పాల్గొన్నారు.

నెల్లికుదురు : ఉపాధ్యాయులపై జరుగుతున్న భౌతిక దాడులను నివారించాలని టీపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి సంగ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయులపై దాడిని ఖండించాలి

కురవి : రాయచోటిలో ఉపాధ్యాయులపై దాడి చేయడాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బలాస్టి రమేశ్ కోరారు. గురువారం మండలంలోని మోద్గులగూడెం జెడ్పీ, ప్రాథమిక పాఠశాలలో సంఘం సమావేశం ఓదెల శివకుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాయచోటి ఉన్నత పాఠశాలలో పనిచేసే ఎజాజ్‌అహ్మద్‌పై జరిగిన దాడి హేయమైన చర్య అన్నారు. ఇలాంటి దాడులు జరగకుండా చూడాలని తెలిపారు. తోట శ్రీరాములు, దయ్యాల మల్లయ్య, కేఎస్ఎస్ లత, ఇందిరా, భాగ్యలక్ష్మి, రజిత, రమేష్, సునీల్, లక్ష్మవెంకన్న, శ్రీనివాస్, రహేశ,శైలజ, సరిత, కావ్య పాల్గొన్నారు.

దాడులు సరికావు

పెద్దవంగర : విద్యార్థులను సన్మార్గంలో నడిపించేందుకు తోడ్పాటు అందజేస్తున్న ఉపాధ్యాయులపై దాడులు చేయడం సరికాదని టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సోమారపు ఐలయ్య అన్నారు. ఇలాంటి ఘటనలను ఖండిస్తున్నామని, మృతి చెందిన ఉపాధ్యాయుడికి ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో యాకయ్య, యుగేందర్, మల్లేశం, కోటేశ్వర్, హరిసింగ్, విజయలలిత, రమేష్, ప్రభాకర్, రాజేందర్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ మృత్తిక దినోత్సవం




నెల్లికుదురు: అవగాహన కల్పిస్తున్న ఏఓ




తొర్రూరు రూరల్: మాట్లాడుతున్న ఏఓ భాస్కర్

నెల్లికుదురు/పెద్దవంగర/గూడూరు/దంతాలపల్లి / కేసముద్రం/ కురవి/గంగారం/ డోర్నకల్ /తొర్రూరు రూరల్ : ప్రపంచ మృత్తిక(నేల) దినోత్సవాన్ని గురువారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. నేల సంరక్షణ కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. నేల కలుషితం కాకుండా భవిష్యత్ తరాలకు సుస్థిరమైన సజీవ వనరు అందించడం మన బాధ్యత అని పలువురు వ్యవసాయ అధికారులు అన్నారు. ఆయా కార్యక్రమాల్లో నెల్లికుదురు ఏఓ షేక్ యాస్మిన్, పెద్దవంగర ఏఓ స్వామి నాయక్, గూడూరు ఏఓ అబ్దుల్‌మాలిక్, కేసముద్రం ఏఓ వెంకన్న, కురవి ఏఓ చాయారాజ్ , దంతాలపల్లి ఏఓ వాహిని,గంగారం మండల వ్యవసాయాధికారి రాంబాబు, డోర్నకల్ చిలుకోడు వ్యవసాయ విస్తరణ అధికారి అవినాష్ , తొర్రూరు మండల వ్యవసాయ శాఖ అధికారి భాస్కర్, ఏఈఓలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



డోర్నకల్: అవగాహన కల్పిస్తున్న ఏఈఓ



గంగారం: సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

రేపు ఆటోల బంద్

బయ్యారం/ నెహ్రూసెంటర్/దంతాలపల్లి : ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రేపు (శనివారం) రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న ఆటోల బంద్‌ను జయప్రదం చేయాలని పలు కార్మిక సంఘాల నాయకులు కోరారు. ఆటోల బంద్ విజయవంతం కోరుతూ ముద్రించిన పోస్టర్లను గురువారం దంతాలపల్లి, బయ్యారంలో టీయూసీఐ, సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు, జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో బంద్ పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన రూ. 12 వేల జీవనభృతి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.